క్లుప్తంగా

వాసుపల్లి ఔదార్యం



రమణ కుమారుడికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు ఎల్లమ్మ తోటకు చెందిన సినీ హీరో బాలకృష్ణ వీరాభిమాని వల్లి రమణ స్ట్రోక్‌తో ఇటీవల మరణించాడు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. విషయం తెలుసుకున్న వాసుపల్లి మృతుడి కుమారుడు శ్యామ్‌కు రూ. 5 వేలు అందించారు. ఆదివారం 104 ఏరియాలో గల తన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ సినీ హీరో నందమూరి బాలకృష్ణ వీరాభిమాని వల్లి రమణ ఎన్నో సేవలందించారన్నారు. వ్యక్తిగతంగా తనని కూడా అంతగానే అభిమానించేవాడని వాసుపల్లి గుర్తు చేసుకున్నారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏ కష్టం వచ్చినా తను తోడుగా ఉంటానని ఆ కుటుంబానికి ధైర్యం కల్పించారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్



స్టోరీ టెల్లింగ్ కార్యక్రమంలో ఆసక్తిగా కథ వింటున్న పిల్లలు

సీతంపేట : ద్వారకానగర్ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా లైబ్రరీ మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం చిన్నారులను ఆకట్టుకునేలా ఉత్సాహంగా సాగింది. చందమామ కథ వ్యవస్థాపకురాలు శ్రీకరుణ ఆకర్షణీయమైన కథలు, సృజనాత్మక అంశాలతో పిల్లలను ఉర్రూతలూగించారు. 'ది హ్యాట్ సెల్లర్ అండ్ ది మంకీస్' కథను, పంచతంత్రంలోని 'ఒక కాలం' కథను టాయ్స్‌తో చక్కగా వివరించారు. అలాగే మంచితనం యొక్క బలం, స్నేహం, సమస్యల నుంచి పరిష్కారం కనుగొనే 'ది బేబీ ఎలిఫెంట్ అండ్ ది బన్నీ రాబిట్' నీతి కథను బోధించారు. పిల్లలను ఆకట్టుకునేలా తోలు బొమ్మలు, టోపీలు ఉపయోగించి సృజనాత్మకంగా కథలు బోధించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పునర్వినియోగం, రీసైక్లింగ్ ప్రాముఖ్యత వివరించేలా ది క్లీవర్ టైలర్ జానపద కథ పిల్లలను ఆలోచింపజేసింది.

క్రికెట్ పోటీలు ప్రారంభం



టాస్ వేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్

అగనంపూడి: సంక్రాంతి సందర్భంగా వడ్లపూడిలో నిర్వహిస్తున్న వార్డు క్రికెట్ లీగ్ టోర్నమెంట్ రెండో రోజు పోటీలను వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల పరిచయ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మొదలవలస అప్పలరాజు, నాయకులు ఆడారి శ్రీను, న్యాయవాది లీలాప్రసాద్, కాంగ్రేగుల దినేష్, మొల్లి మహేష్ పాల్గొన్నారు.

సుమితకు అభినందనలు

కంచరపాలెం: విద్యార్థుల అభ్యాస శైలి-అకడమిక్ అచీవ్‌మెంట్ అనే అంశంపై పి.సుమిత డాక్టరేట్ పొందారు. ఈ అంశంలోనే ఉపాధ్యాయుల క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్ తదితర విషయాలపై ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. శివ ప్రసాద్ చేతుల మీదుగా సుమిత డాక్టరేట్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రెవరెండ్ ఫాదర్ చిటికల రాజ్‌కుమార్ సుమితను ఘనంగా అభినందించారు. ఆమె కేరళలోని వాయనాడ్‌లో గల అంజుకున్ను గ్రామానికి చెందిన వేణుగోపాల్, రాధల కుమార్తె. భర్త కమాండర్ కార్తీక్ నావికా సేనలో విధులు నిర్వర్తిస్తున్నారు.

పండగ వేళ అప్రమత్తం

సంక్రాంతి పండగ వస్తుందంటే చాలు ప్రతి ఇంట సందడి మొదలవుతుంది. సొంత గ్రామాలకు వెళ్లాలని, కొత్తబట్టలు కొనాలని ఉత్సాహం చూపిస్తుంటారు. ఇదే అదనుగా తీసుకుని దొంగలు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. చాలా మంది పండగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే తొందరలో అజాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. చుట్టుపక్కల వారికి కూడా ఇంటిపై కాస్త నిఘా ఉంచాలని చెప్పకుండా వెళ్లిపోతుంటారు.

- దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు
- షాపింగ్ మాల్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, రద్దీ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం
- ఎల్ఎంహెచ్ఎస్ యాప్‌తో ఊళ్లకు వెళ్లే వారి ఇళ్లకు పోలీసు భద్రత లభిస్తుందని భరోసా



వస్త్ర దుకాణం వద్ద అవగాహన కల్పిస్తున్న టూటౌన్ క్రైం పోలీస్





ఎల్‌హెచ్ఎంఎస్ యాప్

అల్లిపురం: పండగ నేపథ్యంలో పోలీసులు నేర నియంత్రణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కరపత్రాలు, ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు. మాల్స్, బట్టల దుకాణాల వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పండగ వేళ బయటి ఊళ్లకు వెళ్లినప్పుడు..

- ఇంటి చిరునామా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలి. ఎప్పుడు ఊరు వెళ్తున్నదీ, ఎప్పుడు తిరిగి వస్తున్నదీ తేదీలతో సహా తెలపాలి. ఇంటి యజమాని ఫోన్ నంబరు అందజేయాలి. లేదా వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి.
- అపార్టుమెంట్లలో ఉన్న వారు వాచ్‌మెన్‌ను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. వాచ్‌మెన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చేటప్పుడు వాచ్‌మెన్‌తో వారిని ప్రశ్నింపజేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు, అడ్రస్, ఫోన్ నంబరు, ఎక్కడికి వెళ్తున్నదీ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.
- అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోను, ప్రవేశ ద్వారం, కారిడార్‌లోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకండి. చిన్నపిల్లలు, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకండి.
- షాపింగ్ చేసేవారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బులతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్న చోట జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగిలించేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తుండాలి.
- కరెన్సీ నోట్లు కింద పడేసి, మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు, తెచ్చుకున్న డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది. ముందుగానే జాగ్రత్త పడితే నష్ట నివారణ చేపట్టవచ్చు.
- డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వాలి. వీలైనంత వరకు నగదు రహిత లావాదేవీలకు మొగ్గు చూపాలి.

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్ ఉపయోగించాలి..

తాళం పడితే చాలు.. దొంగలు చేతి వాటం ప్రదర్శించి కన్నం వేస్తారు. ఈ నేపథ్యంలో సాంకేతిక సాయంతో.. దొంగతనాలకు చెక్ చెప్పే ఆధునిక వ్యవస్థను నగర పోలీసులు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్‌ను ప్రజలు తమ మొబైల్లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు ఈ యాప్ సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు మీ ఇంటి దగ్గర టెక్నాలజీ సహాయంతో భద్రత కల్పిస్తారు. ఈ యాప్‌ను ముందుగా.. గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎప్పుడైనా ఊరికి వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీస్ నిఘాలో ఉంటుంది. ఒకవేళ దొంగలు వచ్చి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే.. అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఆ సమాచారం వెంటనే పోలీసులకు అందుతుంది. మీరు లేని సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే ఆ వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాల సహాయంతో పోలీస్ కంట్రోల్ రూంకి చేరుతాయి. ఇవన్నీ ఈ యాప్‌తోనే సాధ్యమవుతాయి. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని నగర పోలీసులు కోరుతున్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి..



సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే వారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. లేదా పోలీస్ యాప్ ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. పండగ షాపింగ్ చేసే సమయంలో నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవసరమైనప్పుడు డయల్ 100, 1090కి గాని, టూటౌన్ 0891-2783672, మహారాణిపేట 0891-2746866 నంబర్లలో గాని ఫిర్యాదు చేయండి. పండగ సంతోషంగా చేసుకోండి.

– కె.కృష్ణ, టూటౌన్ క్రైం ఎస్ఐ



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ట్రాఫిక్, క్రైం పోలీసులు

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్ బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న బాలభవన్ విద్యార్థుల నృత్యరూపకం



గోదారంగనాథులు, సీతారాముల నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం దేవాలయ ఆవరణలో బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బాలభవన్ విద్యార్థులు గోదాకల్యాణం, రామాయణ నృత్య ప్రదర్శనతో అలరించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య భక్తి మంజరికి చెందిన సరగడ నూకరాజు, రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డ్రాయింగ్ టీచర్ మోహన్‌రావు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో స్థానికులే కాక దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొనడం విశేషం. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సీహెచ్ మోహన్‌రావు పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ రకాల బొమ్మలు గీశారు. పోటీల అనంతరం విజేతలుగా నిలిచిన జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన జె. లక్ష్మి (ప్రథమ), ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలకు చెందిన ఎస్. మౌనిక (ద్వితీయ), చినగదిలి శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌కి చెందిన ఎస్. శైలేంద్ర (తృతీయ)కు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మోహన్‌రావును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందజేయాలని కోరారు. మోహన్‌రావు శిక్షణలో ఎంతో మంది విద్యార్థులు మంచి కళాకారులుగా ఎదిగి, ఉద్యోగావకాశాలు పొందారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి. నల్లరాజు, వి. దానయ్య, మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సామగ్రితో అవస్థలు



రహదారిపై వేసిన భవన నిర్మాణ సామగ్రి

జగదాంబ: భవన నిర్మాణ సామగ్రితో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులోని 75 ఫీట్ రోడ్డులో భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆ నిర్మాణాలకు సంబంధించి రాయి, పిక్క, ఇసుక, ఇటుక వంటి సామగ్రి రహదారి పైనే వేసి వదిలేయడంతో అటుగా వచ్చే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాస్తవానికి నిర్మాణాలకు సంబంధించి సామగ్రిని భవన యజమానులు లోపల వేసుకోవాలని జీవీఎంసీ నిబంధన ఉంది. కానీ దానిని పాటించకుండా ప్రధాన రహదారి పైనే వేసి పనులు చేసుకుంటున్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ప్లాన్ ఇచ్చిన తర్వాత కనీసం అటు చూడకపోవడం వల్ల ఇలా జరుగుతుందని పలువురు వాపోతున్నారు. వార్డులో ఫ్రూట్‌మార్కెట్, పందుపుల్లల సందులో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి రహదారిపై నిర్మాణ సామగ్రి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

విశాఖ వ్యాలీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

ఆరిలోవ: విశాఖ వేలీ పాఠశాలలో ఆదివారం మిలాన్-2025 పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1968 నుంచి 2023 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులంతా ఒకేచోట కలిశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన వీరి కలయికకు అదే పాఠశాల వేదిక కావడం విశేషం. నగరంలో ఉన్న కొందరు పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహణకు నడుంబిగించారు. దీంతో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పాఠశాలలో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకొన్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 3,800 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. వీరికి పూర్వవిద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. చదువుకొన్న పాఠశాలలోనే పూర్వ విద్యార్థులంతా కలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ప్రమాణ స్వీకారం

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో జరిగింది. సంఘ సభ్యులు సమక్షంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు.

అనంతరం నూతన అధ్యక్షుడు సౌనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. సంఘ సభ్యులైన గిరిజన ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ, రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణతో ఆధ్యాత్మిక చైతన్యం



కుసుమ హరనాథులు

దాబాగార్డెన్స్: కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆంగ్ల నూతన సంవత్సరం, మకర సంక్రాంతి సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో గల కుసుమ హరనాథుల దివ్య మంగళమూర్తుల సన్నిధిలో సంకీర్తన యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో అనకాపల్లి కుసుమ హరనాథ మహిళా సమాజం, మధుర గాయని విజయలక్ష్మీ కామేశ్వరి పాల్గొని ప్రేమావతారులపై మధురంగా సంకీర్తనలు గానం చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, జగన్నాథరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భగవన్నామ స్మరణతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ఎంవీ రాజశేఖర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాలను ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, కోశాధికారి ఎస్. అన్నాజీరావు, సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కళాసీలకు దుస్తుల పంపిణీ



కళాసీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నితీష్‌రెడ్డి, మంగరాజు

పెదగంట్యాడ: పేదలు సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించుకునేందుకు దుస్తులు అందజేయడం అభినందనీయమని వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు తిప్పల నితీష్‌రెడ్డి అన్నారు. పెదగంట్యాడ వర్తక సంఘం సభ్యుడు కులుకూరి మంగరాజు ఆధ్వర్యంలో పెదగంట్యాడ అరుణ సినిమా హాల్ ప్రాంగణంలో కళాసీలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు ఆనంద్, బచ్చు శ్రీనివాసరావు, కొత్తా నవీన్, అరుణ సూర్యనారాయణ, నంభూరి సత్యనారాయణ ,అయ్యప్ప, ఎస్వీఎస్ కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరువీధి



ఉక్కునగరం సెక్టార్లలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులను రథంపై పెట్టి ఊరేగించారు. మహిళలు, పిల్లలు కోలాటం ఆడారు. అంతకు ముందు స్వామికి వేకువజామున ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

ఎప్పుడేం జరుగుతుందో..



స్పృహ తప్పిన కళాసీకి తోచిన వైద్యం చేస్తున్న స్థానికులు



హమ్మయ్య.. ప్రాణం నిలిపారు

- ఫిట్స్‌తో గిలగిల కొట్టుకున్న వ్యక్తి
- కాపాడి మానవత్వం చాటుకున్న పలువురు వ్యక్తులు

దాబాగార్డెన్స్: జీవన పయనంలో ఎప్పుడేం జరుగుతుందో ఊహించడం ఎవరి తరం? బతుకు బాటలో సాగిపోతున్న ఓ వ్యక్తి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే.. 108 వాహనం వచ్చే వరకు ఆగకుండా పలువురు మానవత్వం చాటుకున్నారు. వారికి తెలిసిన రీతిలో వైద్యం అందించారు. నడిరోడ్డుపై ద్విచక్ర వాహనంపై ఫిట్స్ వచ్చి గిలగిల కొట్టుకుంటుంటే.. వెంటనే తోటి ద్విచక్ర, త్రిచక్ర వాహన చోదకులు అతనికి ప్రాణం పోసి మానవత్వం చాటుకున్నారు. మానవత్వానికి సాక్షిగా నిలిచిన దృశ్యాలు సాక్షి తన కెమెరాలో బంధించింది.

వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం పదకొండు గంటల సమయంలో జడ్జి కోర్టు జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తి గిలగిల కొట్టుకుంటూ కనిపించాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న అతను ఏ క్షణంలో అయినా కింద పడిపోయే స్థితిలో ఉండగా అటుగా వెళ్తున్న వారు అతను కింద పడిపోకుండా పట్టుకున్నారు. కొందరు 108కి ఫోన్ చేశారు. అయితే ఎంతకీ అది రాలేదు. కొద్ది సేపటికి స్పృహ కోల్పోయిన ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చాడు. అతన్ని ఒకచోట కూర్చోబెట్టి కొందరు ముఖంపై నీళ్లు చల్లారు. అతని బంధువులకు ఫోన్ చేసి సమాచారం అందించి మానవత్వం చాటుకున్నారు.

అతను పూర్ణామార్కెట్ కళాసీ..

నడిరోడ్డుపై ఫిట్స్‌తో గిలగిలలాడిన ఆ వ్యక్తి పూర్ణామార్కెట్ అరటిపండ్ల దుకాణాల కళాసీ అని స్థానికులు గుర్తించారు. ఆదివారం అరటిపండ్ల వ్యాపారులు (రిటైలర్స్, హోల్‌సేల్ వ్యాపారులు, కళాసీలు) శివాజీపార్కులో పిక్నిక్ వేసుకున్నారు. పూర్ణామార్కెట్ నుంచి శివాజీపార్కుకు వెళ్తున్న సమయంలో ఆ కళాసీ ఇలా మూర్ఛ వ్యాధికి గురయ్యాడు. అతని కన్నా ముందు వెళ్లిన మరికొందరు ఇంకా రాలేదని మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న కళాసీకి ఫోన్ చేస్తే.. స్థానికులు ఆ ఫోన్ ద్వారా జరిగిన సంఘటన తెలిపారు. దీంతో వారంతా వచ్చి అతన్ని ఇంటికి తీసుకెళ్లారు.

కూలేందుకు సిద్ధంగా రక్షణ గోడ



వివేకానందనగర్‌లో ప్రమాదకరంగా మారిన రక్షణ గోడ

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి వివేకానంద నగర్ గ్రీన్‌బెల్ట్ రక్షణ గోడ కూలేందుకు సిద్ధంగా ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిలో నిర్మించిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌కు ప్రహరీగా ఉన్న రక్షణ గోడలు ప్రమాదభరితంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలకు ఆనుకుని ఉన్న డెబ్రిస్ భారానికి గోడలు ప్రమాదభరితంగా మారాయని చెబుతున్నారు. సచివాలయ సిబ్బందికి, ఇంజినీరింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందించే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రస్తుతం ఇటువైపు చూడడమే లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.